
కథ

# గుండె చప్పుడు

ఎం.వి.ఎస్. హరనాధరావు



"గుండె గొంతుక లోన కొట్టాడుతాది" అంటోంది రేడియోలో ఎంకి. నండూరి వారి ఎంకి ఏమైనా అంటుంది.

ఆమె గారి పరిస్థితి అది.

కానీ- నా గుండెకు... ఆ అదృష్టం లేదు. ఎందుకంటే... నా గుండె బేలన్సు తప్పి కొట్టుకుంటోంది. డాక్టరుగారు చెప్పిన విషయానికి తన్నుకుంటోంది. కుజదోషంలో వున్న మా అమ్మాయి పెళ్లి విషయంలో కొట్టుకుంటోంది. ఎటొచ్చి అది కొట్టుకుంటోందన్న ఆనందమేకానీ ఎన్నాళ్లు కొట్టుకుంటుందో, ఎప్పుడు కొట్టుకుపోతుందో అన్న భయం వల్ల నా గుండె గుండెలా లేదు. గుండెల్లో కుంపటిలా వుంది.

పదిహేను రోజుల క్రితం. పెద్ద బోర్డు, పెద్ద పేరు, అంతకంటే పెద్ద ఫీజు తీసుకునే డాక్టరు గారు చెప్పేశారు.

మా ఆవిడ కన్నీళ్లు పెట్టుకుంది.

పెళ్లయ్యేదాకా మా నాన్నను కాపాడమని దేవుడికి దండం పెట్టుకుంది... మా అమ్మాయి...

ఎందుకు-?

ఆపరేషను చేయకపోతే నా గుండె గల శరీరానికి రేషను అయిపోతుందట.

''తప్పదా డాక్టర్''.

''రక్త నాళాల్లో కొవ్వు చేరింది. బైపాస్ తప్పదు''

''చెయ్యకపోతే''.

''చస్తావు'' అన్నట్లు చూశారు డాక్టరు.

''మార్గం లేదా''

''వుంది''.

''ఏమిటది''

''భగవద్గీత చదువుకో''

''ఎందుకు''

''పెద్ద డాక్టరు కాపాడతాడేమో''

''ఆయనెరవు''

''ఇంకెవరు – దేవుడు–''

డాక్టరు గారి పేరు ముళ్లపూడి వెంకటరమణ కాదు, జోకులు పేల్చడానికి.

బాపూ గారి మధ్య తరగతి వాడి కార్టూన్ లాంటి నా ముఖం చూస్తే ఎవరైనా జోకులు.. వేస్తారు.

''ఎంత ఖర్చయినా ఆపరేషన్ చేయించుకోండి'' ఖర్చు లేని కన్నీళ్లు కారుస్తూ అంది నా భార్య.

''నాన్నా'' అంటూ నా గుండెలను చేతులతో రుద్దింది పెళ్లికాని నా కూతురు... వురఫ్ గుండెల మీద కుంపటి.

''నా పసుపు కుంకాలకైనా మీరు–''

''పావలా పారేస్తే వచ్చే నీ పసుపు కుంకాల కోసం, లక్షలు తగలేసి ఆపరేషన్ చేయించుకు చావాలా''

సిన్మాల్లో భార్యల్లా ఆమె తాళి కళ్ల కద్దుకోలేదు. ఎందుకంటే ఏడుపు ఎక్కువై కన్నీళ్లు తుడుచు కోవడంలో చేతులు ఖాళీగా లేవు కాబట్టి.

''అమ్మా ఏడవద్దే. నా కట్నం కోసం దాచిన సొమ్ముందిగా. అది పెట్టి నాన్నకు ఆపరేషను–''

ఏం త్యాగం.

ప్రపంచంలోని త్యాగం మొత్తం నా కూతురు శరీరాన్ని ఆక్రమించుకుందా!

కానీ – నిజమైన త్యాగం చేసే వారికంటే, త్యాగం రంగు పూసుకుని నటించే వారిని గుర్తించడం చాలా కష్టం.

నా కూతురు నటిస్తోందా!

అనుమానం అనేది మనిషికి వయసుతో పాటు పెరుగుతుంది.

నాకూ అంతేనా! దెబ్బతిన్న గుండెలకు కొత్త గుండెలు రేషను కార్డుల మీద ఇచ్చే రోజులు ఎప్పుడు వస్తాయి.

''ఎప్పటికీ రావు''

పార్కులో శీనయ్య సీరియస్‌గా అన్నాడు.

శీనయ్యకు ఈ మధ్యనే బైపాస్ చేశారు. తన అనుభవాలను చెప్పి ఎదుటివాడి ముందు తన తెలివిని చాలామంది ప్రదర్శిస్తారు. చెప్పేవాడికి వినేవాడు లోకువ.

''ఎందుకు ఆలోచన. మూడు లక్షలు పారేస్తే కోసి అవతల పారేస్తారురా సుబ్బిగా''

అవును – మూడు లక్షలు – కోసి అవతల పారేస్తారు.

అంతపోసినా, కోసినా, ఎప్పటికయినా ఈ శరీరాన్ని అవతల పారేయాల్సిందిగా, పారేసీ ఈ దేహం కోసం కూతురు పెళ్లికని దాచిన సొమ్మును ఆసుపత్రిలో పారేసుకోవాలా!

బ్రతికినంత కాలం నా బిడ్డ నన్ను శపించదా!

నా గుండె ''లబ్ డబ్'' అని కాదు – తప్పు చేశావు అని కొట్టుకోదా!

యవ్వనంలో నా బిడ్డ కోరికలు, సుఖాలు, ఆనందాలు, ఆశలు అన్నీ అన్నీ... నా దరిద్రపు గుండె క్రింద పడి నలిగి పోవాలా!

నాకు నా గుండె ఆలోచనే కాని... దాని మనస్సును ఆలోచించే అవసరం లేదా!

ఏదయినా కష్టం వస్తే అందరూ గుండెరాయి చేసుకో అంటారు.

ఈ గుండెను నిజంగా రాయిగా ఆ దేవుడు సృష్టిస్తే లక్షలు పోసి రిపేర్లు చేయించుకునే అవస్థ తప్పేది గదా!

ఈ దేవుడు గుండె డాక్టర్ల దగ్గర లంచాలు మేసి తప్పుచేశాడు. అందుకే గుండెలను రాళ్లలో చేయలేదు.

పిచ్చి ఆలోచనలతో ఆ రాత్రి నిద్ర పట్టలేదు. గుండె చెరువయింది. ఆ చెరువులో చేపల్లా కలలు.

యమదూతలు కాలింగ్ బెల్ కొడుతున్నారు.

మా ఆవిడ తలుపు తీసింది.

''ఎవరు మీరు''

''యమదూతలం. మీ ఆయన ప్రాణాల కోసం వచ్చాం''.

''అయ్యో'' ఏడుస్తోంది.

''మొగుడి ప్రాణాలు కాపాడుకోవడానికి నేను సావిత్రిని కాదు''

''అది తెలిసే వచ్చాం – ధైర్యంగా''

''నా భర్తకు బదులు నా ప్రాణాలు తీసుకు వెళ్లండి''

''కుదర్దు. మాట వస్తుంది''

''నా కూతురు పెళ్లి దాకా ఆగండి''

అంటే – నా కూతురు పెళ్లిచేశాక నేనుపోయినా ఫర్లేదా! నేను కన్యాదానం చేశాక ఆ యమదూతలకు నా పెళ్లాం నా ప్రాణాలు దానం చేస్తుందా!

నా కూతురు దూతలకు కాఫీ ఇచ్చింది.

''మంచి కాఫీ ఇచ్చావు. ఏం కావాలో కోరుకో తల్లీ''

మా నాన్న ప్రాణాలు కాపాడండి అని నా కూతురు తప్పక అడుగుతుంది.

కానీ –

''మా నాన్న ప్రాణాలు అర్జంటుగా మీరు తీసుకు వెళ్లకపోతే నా ప్రాణాలు పోతాయి. జీవితాంతం కన్నెగా బ్రతకాలి. ఆ ముసలి ప్రాణాలు... ఇంకా ఎందుకు – నా ప్రాణాలు తీయడానికా. ఆయనకు ఏడు కట్ల సవారీ లేకపోతే నా బ్రతుకులో ఏడడుగులు నడిచే ఛాన్సు లేదు. నా మాట విని.... అర్జంటుగా––''

''ఒసేయ్'' అరిచాను.

*****

కళ్లు తెరచాను.

ఎదురుగా కూతురు, భార్య ఏడుస్తున్నారు.

నవ్వాను.

''నేను చచ్చాక నరకానికి వచ్చాక, సంసారాన్ని కూడా నరకానికి పిలిపించి ఇలా ఏడ్చే ఏర్పాట్లు చేశారా''

వాళ్లు ఏడుపులు ఎక్కువయ్యాయి.

''చావు తప్పదనుకున్నప్పుడు భయంగానీ, ఇలాంటి పిచ్చి మాటలు కానీ పుట్టుకొస్తాయి.

స్నేహితుడు శీనయ్య అన్నాడు.

''ఎక్కడున్నాను''

''మాంత్రికుడి గుహలో''

''రాత్రంతా పిచ్చికేకలు... వొళ్లంతా చెమటలు. నీ పెళ్లాం, కూతురు కంగారు పడ్డారు. 108 వచ్చింది. ఆసుపత్రికి తెచ్చాం. ఆపరేషను అర్జంటూ'' అన్నారు.

''ఎంతవుతుందిట''


''నా పెళ్లి ఖర్చంత'' నా కూతురు అనని మాటలు వినిపించాయి.

''మూడు లక్షల దాకా'' శీనయ్య అన్నాడు.

''నాకు ఆపరేషను వద్దు'' నా అరుపు.

''నాకు మీరు కావాలి'' నా భార్య ఏడుపు.

''ఏం చెప్పి ఏడవాలో అర్థం కావడం లేదు'' తల్లి ఏడుపుకు సాయం చేసింది నా కూతురు.



''అలా ఏడిస్తే హార్ట్‌పేషెంటు కంగారు పడదూ'' చక్రాల కుర్చీ పక్కన... తెల్లటి డ్రస్సులో నల్లటి నర్సు.

చీకటి వెలుగులు భరించినప్పుడే జీవితం అందంగా వుంటుంది అన్న సందేశం ఇచ్చే విగ్రహంలా వుందా నర్సు.

పరీక్షల కోసం చక్రాల కుర్చీ ఎక్కాను.

కదలని కుర్చీలో ముప్ఫయి ఏళ్లు టీచరుగా ఎంతోమందికి పాఠాలు చెప్పాను.

ఇప్పుడు –

కదిలే కుర్చీలో కూర్చుని చెప్పిన పాఠాలకు నాకు అందిన ప్రావిడెంటు ఫండు ఖర్చు చేయడానికి కదిలాను.

''వీరే డాక్టరు ప్రేమ్‌చంద్ గారు''

''నమస్కారం''

గుండెలు కోయడంలో డాక్టరు గారికి పెద్ద పేరుంది. నన్ను చూసి నవ్వాడు.

నేను నవ్వలేదు.

మూడు లక్షల 'గుండె కోత' ఖర్చు కింద పడి నా నవ్వు నలిగి పోయింది.

''ఏం భయం లేదు మేస్టారూ'' రిపోర్టులు చూస్తూ అన్నాడు కుర్ర డాక్టరు.

డాక్టర్లకు రోగాలే కనిపిస్తాయి. రోగుల భయాలు కనిపించవు.

''రెండ్రోజుల్లో ఆపరేషన్ చేస్తాను''

''ఆపరేషను తప్పించలేవా బాబూ! అంత సొమ్ముపోసి నేను బ్రతకాల్సిన అవసరం లేదు నాయనా! నేను బ్రతికితే పెళ్లికాదని నా కూతురు చచ్చిపోతుంది. ఏ సుఖం లేని నా బిడ్డను చూస్తూ బ్రతికే బ్రతుకు కంటే, చావడమే నాకు సుఖం నాయనా''.

నా గుండె రిపోర్టు చూసినంత సీరియస్‌గా నా మనసు రిపోర్టు చూశాడు డాక్టరు ప్రేమ్‌చంద్.

డాక్టర్లలో ఫీలింగులు కనబడవు – సిన్మాల్లో తప్ప.

ఒకటే మాట – ఒకటే ఫీలింగు.

''ఈ మందులు వాడండి'' ఒకటే మాట.

''వాడాక చూద్దాం'' ఒకటే ఫీలింగు

ఆపరేషనుకు ముహూర్తం చూశారు.

''ఆ ముహూర్తానికి చాలా పెళ్లిళ్లున్నాయి'' అన్నట్టు చూసింది నా కూతురు

నా జీవితం సైజు పెరగాలని, నుదుటి మీద కుంకుమ బొట్టు సైజు పెంచింది నా భార్య.

ఆపరేషన్‌కు రంగం సిద్ధమైంది.

***

ఇంటికి తీసుకు వెళ్లారు.

నా భార్య దిష్టి తీసింది.

నా కూతురు పెళ్లి కూతుర్లా ఎదురొచ్చింది.

అందరిలో ఆనందం – లేనిది నా ఒక్కడికే

''అమ్మా'' అంటూ ఏడ్చేశాను.

''నీకు అన్యాయం చేశాను తల్లీ''

''నాన్నా'' ఓదార్చింది నా కూతురు.

''ధైర్యంగా వుండండి నాన్నా... నా పెళ్లి గురించేగా దిగులు. రాజమండ్రి సంబంధం ఖాయం చేయండి''.

''నోట్లకట్టలు చూసి చేసుకుంటారు కానీ – నా గుండెల మీద కుట్లుచూసి ఎవరు చేసుకుంటారమ్మా!''

''పిచ్చి నాన్న'' ముద్దెట్టుకుంది.

నా భార్య ఏడుస్తూ అంది. అది సంతోషంలో వచ్చే ఏడుపు అని నాకు అర్థం కాలేదు.

''మీకు పైసా ఖర్చులేకుండా ఆపరేషను చేశారు''

''ఆ'' రిపేరు గుండె...కు... తాజాగా నొప్పి.,

''అవునండి. ఆ డాక్టరు గారు దేవుడు. ఖర్చులన్నీ ఆయనే భరించారు. నా కూతురికి బిడ్డ పుడితే ఆ డాక్టరు గారి పేరే పెట్టుకుంటాను''

కూతురు సిగ్గు పడింది.

నేను ఆలోచనలో పడ్డాను.

''స్నానం చేస్తే గుడికి వెళ్లి వద్దాం''

''నేను రాను''

''ఏం''

''నేను డాక్టరు దగ్గరకు వెళ్తాను''

****

''నమస్తే మేస్టారూ''

డాక్టర్ ప్రేమ్‌చంద్ ఆరోగ్యంగా నవ్వాడు.

''ఏం నాయనా! ఆపరేషన్ ఫ్రీగా చేశావట... నీ రుణం...'' గుండె గొంతుకలోన కొట్లాడుతాది అన్నట్లు ఆగిపోయింది మాట.

''మేస్టారూ – నేను... మీ స్టూడెంటును''

అతగాడ్ని... దీక్షగా చూశాను.

గుర్తు రాలేదు.

ఎన్నో వేల మందిలో అతనొకడు.

సృష్టించిన జీవులు దేవుడికి, పాఠాలు... నేర్పిన విద్యార్థులు గురువులకు... గుర్తుండరు.. ఎవరో మహానుభావులు తప్ప...

ఈ ప్రేమ్‌చంద్ అంతటి మహానుభావుడా! మరి గుర్తు లేడే

''రండి మేస్టారూ'' చెయ్యి పుచ్చుకొని లోపలకు తీసుకు వెళ్లాడు.

అక్కడ గోడకు ఓ పటం చక్కటి ఫ్రేములో వుంది.

''ఆ పటాన్ని చూడండి''

చూశాను.

పటం అర్థం కాలేదు. ఏవో పిచ్చి గీతలు. కళ్లజోడు పెట్టుకొని చూశాను. డాక్టరు గారి అమ్మ పటం కాదు. మదర్ థెరిస్సా బొమ్మ అంతకంటే కాదు.

ఓ గుండె బొమ్మ.

పెన్సిలుతో పిచ్చి పిచ్చిగా గీసిన బొమ్మ. ఆ గుండె బొమ్మ కింద ఎర్ర ఇంకులో ''సున్న''


''మేస్టారు మీరు మాకు సైన్సు చెప్పారు. గుండె పటం గీసుకు రమ్మన్నారు. గీశాను. దరిద్రుడా! ఇది గుండె పటమా అంటూ కొట్టారు. గోడ కుర్చీ వేయించారు. గుంజిళ్లు తీయించారు. వంద సార్లు గుండె పటం గీయమని శిక్ష వేశారు. ఏడ్చాను. పరీక్షలో నేను గీసిన గుండె బొమ్మకు 'సున్నా' మార్కులు వేశారు. ఆ మార్కులు చూసి నాలో పంతం పెరిగింది. దానికి కారణం మీరు. గుండెను గురించి తెలుసుకోవాలనే తపన పెరిగింది. మీరు వేసిన శిక్షలు నన్ను ఒక్కొక్క మెట్టు ఎక్కించాయి. చదువులో ఆ మెట్లు ఎక్కాను. హార్ట్ స్పెషలిస్టునయ్యాను. అందుకు... గుర్తుగా ఆ రోజు మీరు సున్నామార్కులు వేసిన ఆన్సరు పేపరును జాగ్రత్తగా ఫ్రేము కట్టించాను. పూజించు కుంటున్నాను. నేను ఇంత పెద్ద డాక్టరును కావడానికి కారణం మీరే మేస్టారూ''

అతని కళ్లలో నీళ్లు... గురువు పాదాలు కడిగే పవిత్ర జలాల్లా కనిపించాయి.

నా బిడ్డ పెళ్లికి... ఓ ఏకలవ్యుడు చల్లిన అక్షితలా కనిపించాయి.

మధ్యతరగతి వాడి గుండెకోత పటాన్ని చదివిన డాక్టర్ ప్రేమ్‌చంద్... గుండె చప్పుడు... నా కూతురు పెళ్లి మేళంలా వినిపించింది. గురువుల పట్ల గౌరవం మంత్రాల్లా వినిపిస్తున్నాయి.

★




చిరునామా:
ఎం.వి.ఎస్.హరనాథరావు,
208, శ్రీనిలయ ఎస్టేట్,
అమీర్‌పేట, హైదరాబాద్